గ్లకోమా వ్యాధిపై అవగాహన అవసరం

తెనాలిఅర్బన్: కంటికి సంబంధించిన గ్లకోమా(నీటి కాసుల) వ్యాధిపై అందరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి సూచించారు. గ్లకోమా వ్యాధిపై గురువారం ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గ్లకోమా వల్ల కంటి నరాలు దెబ్బతిని దృష్టిని కోల్పోతారని చెప్పారు. తొలి దశలోనే దీనిని గుర్తించి తగిన చికిత్స తీసుకోవాలని సూచించారు. కంటి విభాగాధిపతి డాక్టర్ ఎప్సిబాయ్ మాట్లాడుతూ కంటిలో ఎరుపుదనం, దురద, నొప్పి, నీరు కారడం వంటివి గ్లకోమా వ్యాధి లక్షణాలుగా భావించవచ్చని వివరించారు. ఈనెల ఆరు నుంచి 12 వరకు గ్లకోమా వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు షేక్ షబిహానా, సుప్రజ, శ్యామ్‌ప్రసాద్, లాస్య పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ సౌభాగ్యవాణి

నేడు జేఎంజే 60వ వార్షికోత్సవం

తెనాలిఅర్బన్: జేఎంజే కళాశాల 60వ వార్షికోత్సవం శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ సిస్టర్ షైనీ ఒక ప్రకటనలో తెలిపారు. వేడుకలకు ముఖ్యఅతిథులుగా సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ పి.నీరజ, కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ థెరిస్సామ్మలు పాల్గొంటారని చెప్పారు.

12న తెనాలిలో ఉచిత వైద్యశిబిరం

అంతర్జాతీయ మహిళ దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకుని రెయిన్ బో ట్రస్ట్ తెనాలి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు ట్రస్ట్ వ్యవస్థాపకురాలు డాక్టర్ జీవనలత తెలిపారు. చెంచుపేటలోని శబరి వృద్ధాశ్రమంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. వైద్యశిబిరంలో గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, కంటి పరీక్షలు, క్యాటరాక్ట్ నిర్ధారణ, ఎముకలు, కీళ్ళకు సంబంధించిన పరీక్షలు, డయాబెటిస్, బీపీ, థైరాయిడ్‌కు సంబంధించిన పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. హెల్త్ హాస్పటల్, అవినాష్ నర్సింగ్ హోమ్, ఓమెగా ఐ హాస్పటల్‌లోని పలువురు వైద్యులు శిబిరంలో పాల్గొననున్నట్లు చెప్పారు.

మహాత్మా సేవా శాంతి ఆశ్రమానికి వీల్‌చైర్ బహూకరణ

తెనాలిటౌన్: బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మాగాంధీ సేవా శాంతి ఆశ్రమంలోని వృద్ధుల సౌకర్యార్థం లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ ఆధ్వర్యంలో వీల్‌చైర్‌ను బహూకరించారు. ఆశ్రమంలో గురువారం ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారికి వీల్‌చైర్‌ను క్లబ్ వ్యవస్థాపకులు కాకరపర్తి సుబ్రమణ్యం అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు సాతులూరి రామ్‌ప్రసాద్, సభ్యులు పాదర్తి వెంకటేశ్వరరావు, పబ్బిశెట్టి మాధవకుమార్, కోణిజేటి రమేష్, లక్కోజు రవి, వి.నాగభూషణము, టి.వరప్రసాద్ పాల్గొన్నారు.


ఆశ్రమ నిర్వాహకులు రామలింగాచారికి వీల్‌చైర్ అందిస్తున్న సుబ్రమణ్యం

న్యాయ విజ్ఞానం తప్పనిసరి

తెనాలిరూరల్: చట్టాల గురించి తెలుసుకోకపోవడం తప్పేనని, అందరికీ న్యాయ వ్యవస్థపై అవగాహన అవసరమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ రిసోర్స్ పర్సన్ ఎ.ఝాన్సీ చెప్పారు. అంతర్జాయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా తెనాలి మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అంగలకుదరు గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఝాన్సీ మాట్లాడుతూ చట్టాల గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. పలు చట్టాల గురించి వివరించారు. న్యాయవాది కట్టా కాళిదాసు మాట్లాడుతూ వృద్ధులకు భృతి అడిగే హక్కు ఉందని, అందుకు ప్రత్యేక చట్టం ఉందని వెల్లడించారు. మండల న్యాయసేవాధికార సంస్థ పర్యవేక్షకుడు షేక్ మహబూబ్, డ్వాక్రా మహిళలు, యానిమేటర్లు పాల్గొన్నారు

హత్యకేసులో నిందితుడి అరెస్ట్

తెనాలిరూరల్: తోటి కార్మికుడిని హత్య చేసిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణంలో నివసిస్తున్న వినుకొండ మండలం గోకనకొండకు చెందిన బేలుదారు కూలీ గండికోట అంకారావు(40)ను అతని సహచర కార్మికుడు వేముల నాగరాజు ఈ నెల 6వ తేదీన హత్య చేసిన సంగతి తెలిసిందే. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన టూ టౌన్ సీఐ ఎస్.వెంకట్రావు నిందితుడిని గురువారం అరెస్ట్ చేశారు.

లారీ డ్రైవర్ అరెస్టు

తెనాలి రూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీ డ్రైవర్‌ను అరెస్ట్ చేసి వాహనాన్ని అధికారులు సీజ్ చేశారు. కొల్లిపర మండలం తూములూరు గ్రామం వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏపీ చలం, ఆయన సిబ్బంది గురువారం గుర్తించారు. లారీ డ్రైవర్‌ను, వాహనాన్ని కొల్లిపర పోలీసులకు అప్పగించారు. 25 టన్నుల ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్టు గుర్తించామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ద్విచక్ర వాహన దొంగలు ఇద్దరు అరెస్ట్

మంగళగిరి: నగరంలో ద్విచక్రవాహనాల చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఇటీవల నృసింహస్వామి ఆలయం వద్ద ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. విజయవాడ సితార సెంటర్‌కు చెందిన గోలి శ్రీనివాసరావు, మంగళగిరి గోపాలకృష్ణ థియేటర్ వద్ద నివసిస్తున్న వల్లభనేని శివరామకృష్ణను అదుపులోకి తీసుకున్నారు. నిందితులను విచారించగా దేవాలయం దగ్గర ద్విచక్ర వాహనాన్ని దొంగిలించినట్లు నేరం ఒప్పుకుని వాహనాన్ని పోలీసులకు అప్పగించగా నిందితులను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు తెలిపారు.

బీసీ వెల్ఫేర్ జేఏసీ మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలిగా ఉమారాణి

మంగళగిరి: బీసీ వెల్ఫేర్ జేఏసీ మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలిగా నగరానికి చెందిన కొడాలి ఉమారాణి నియమితులయ్యారు. నగరంలోని రాష్ట్ర బీసీ వెల్ఫేర్ జేఏసీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఉమారాణికి బీసీ వెల్ఫేర్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అంగిరేకుల ఆదిశేషు నియామక పత్రాన్ని అందజేశారు. రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ నాగేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొల్లి జగన్మోహనరావు, నియోజకవర్గ అధ్యక్షుడు వూట్ల పాల శ్రీనివాస్, జెఎన్టీయూ రిటైర్డు ప్రొఫెసర్ కోదాటి సత్యప్రసాద్, నాయకులు కొడాలి ఉమాశంకర్, కలవకొల్లు గోపిబాబు తదితరులు పాల్గొన్నారు.

107 మందికి కంటి పరీక్షలు

తాడికొండ: శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో తాడికొండలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. బండ్ల కోటేశ్వరరావు మిత్రమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో మొత్తం 107 మందికి వైద్య పరీక్షలు చేశారు. 83 మందికి శుక్లాలు ఉన్నట్లు గుర్తించి శస్త్ర చికిత్సకు సిఫార్సు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. వీరిని శుక్ర, శనివారాలలో రెండు విడతలుగా ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేసి ఆసుపత్రికి తీసుకెళ్లి ఉచిత శస్త్ర చికిత్సలు నిర్వహించనున్నట్లు వైద్య బృందం తెలిపింది. కార్యక్రమంలో పలువురు నిర్వాహకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బకింగ్ హామ్ కెనాల్లో వ్యక్తి మృతి

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని మూడు తూముల సెంటర్లో నివాసముండే ఓ వ్యక్తి ప్రమాదవశాత్తూ బకింగ్ హామ్ కెనాల్‌లో గురువారం మృతి చెందాడు ఎస్ఐ వినోద్ తెలిపిన వివరాలు.. ఉండవల్లి సెంటర్ నుంచి తాడేపల్లి వచ్చే మార్గంలో మూడు తూముల వద్ద నివాసముండే చదల శ్రీనివాసరావు (54) చేపలు పట్టేందుకు కుంచనపల్లి వద్ద బకింగ్ హామ్ కెనాల్‌లో దిగాడు అందరూ చూస్తుండగానే ఒకసారిగా నీటిలో మునిగిపోయి, మృతి చెందాడు. ఈ సంఘటనపై భార్య రుక్మిణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. వాటర్ ట్రీట్మెంట్

పెదకోనేరు ప్రక్షాళన పూర్తి

- ఈ ఏడాది తెప్పోత్సవం నిర్వహించేందుకు సన్నాహాలు
- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) కృషి పట్ల స్థానికుల హర్షం


ప్రక్షాళన చేసిన పెదకోనేరు(కల్యాణ పుష్కరణి)

మంగళగిరి: పెదకోనేరు(కల్యాణ పుష్కరణి) ప్రక్షాళన పూర్తయ్యింది. దీంతో కోనేరును అభివృద్ధి పరచడంతోపాటు చుట్టూ ఫెన్సింగ్ వేసి మొక్కలు నాటి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే కోనేటిలోని దాసాంజనేయస్వామి పూజలందుకుంటుండగా ఈ ఏడాది వైశాఖ పౌర్ణమి రోజున స్వామి తెప్పోత్సవం నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కోనేరులోని నీటిని తొలగించేందుకు 15 ఏళ్ల కిందట ఓఎన్‌జీసీ ప్రయత్నించి సగంలోనే వదిలేసింది. ఆ తర్వాత కోనేరు చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి డంపింగ్ యార్డులాగా తయారైంది. దుర్గంధం వెదజల్లుతుంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) చొరవ తీసుకుని పెద్ద కోనేరును పరిశీలించారు. పెదకోనేరుకు పూర్వవైభవం తీసుకువచ్చి మరలా స్వామి వారికి తెప్పోత్సవం నిర్వహించేలా చూడాలని దేవదాయ శాఖ అధికారులకు సూచించారు. స్పందించిన అధికారులు కోనేరును బాగు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి రాష్ట్ర దేవాదాయ శాఖకు పంపారు. దేవదాయశాఖ రూ.కోటి కేటాయించింది. దేవస్థానం మరో రూ.50లక్షలు కేటాయించి మొత్తం రూ.1.50 కోట్లతో ప్రక్షాళన పనులు చేపట్టారు. జంగిల్ క్లియరెన్స్ చేసి, కోనేరులోని నీటిని తోడి చుట్టూ ప్రహరీ, మెట్ల నిర్మాణంతోపాటు అన్ని రకాల వసతులు కల్పించేలా చర్యలు తీసుకున్నారు. ఎమ్మెల్యే నిరంతర పర్యవేక్షణలో పనులు పూర్తి చేశారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) కృషి పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ప్రాతూరులో గురువారం నుంచి అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. ఇటీవల ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ప్రాతూరులో విస్తృతంగా పర్యటించారు. స్థానికులు ఎమ్మెల్యే ఆర్కేకి వినతిపత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో రూ.కోటీ 80 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. దాన్లో భాగంగా కార్పొరేషన్ డీఈ కృష్ణారెడ్డి చేయవలసిన అభివృద్ధి పనులు పరిశీలించారు. 14, 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.45 లక్షలు కేటాయించడంతో ప్రాతూరు శివాలయం నుంచి తాడేపల్లి కలుపుతూ 265 మీటర్ల పొడవు ఎనిమిది మీటర్ల వెడల్పు ఉన్న రహదారులు గ్రావెల్ సెల్లింగ్ చేస్తున్నట్లు ఇంజినీరింగ్ అసిస్టెంట్ నాగూర్ వలీ తెలిపారు. అనంతరం నాలుగు మీటర్ల వెడల్పుతో సీసీ రోడ్డు నిర్మాణాన్ని చేపడుతున్నామని అన్నారు. సంకురు నాగేశ్వరరావు ఇంటి దగ్గర నుంచి బెజ్జం రమేష్ ఇంటి వరకు 140 మీటర్ల పొడవున నాలుగు మీటర్ల వెడల్పుతో సీసీ రోడ్ నిర్మాణాన్ని చేపట్టామని, ఈ పనికి 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.15 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. రెండు మూడు రోజుల్లో సీసీ రోడ్ నిర్మాణం పూర్తి చేస్తామని ప్రజలు సహకరించాలని కోరారు.


ప్రాతూరు గ్రామంలో నిర్మిస్తున్న రహదారి

ప్రతి ఏడాదీ 20 వేల కేసులు పెరుగుతున్నాయి

తాడేపల్లిరూరల్: భారతదేశంలో పెద్ద వయస్సు వారిలో దాదాపు 10శాతం మంది దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధులతో బాధపడుతున్నారని డాక్టర్ అమలాపాల్ అన్నారు. ప్రతి సంవత్సరం దాదాపు 20 వేలకు పైగా నూతన డయాలసిస్ కేసులు పెరుగుతున్నాయని అన్నారు. అంతర్జాతీయ మూత్రపిండాల దినోత్సవం సందర్భంగా మణిపాల్ హాస్పిటల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ అమలాపాల్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మూత్రపిండాల సంరక్షణను అందుబాటులోకి తీసుకురావడంలో సాధించిన మైలురాళ్లను వివరించారు. కార్యక్రమంలో కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్ డాక్టర్ ఎవిఎస్ఎస్ఎన్ శ్రీధర్, కన్సల్టెంట్ యూరాలజిస్ట్, కిడ్నీ ట్రాన్స్ ప్లాంట్ సర్జన్ డాక్టర్ రవిశంకర్ గంజి, ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ అమలాపాల్

ప్లాంట్‌కు స్థల పరిశీలన

తాడేపల్లిరూరల్: మంగళగిరి, తాడేపల్లి నగర పాలక సంస్థలోని అన్ని ప్రాంతాలకు కృష్ణా జలాలు అందించేందుకు గతంలో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కృష్ణానది ఎగువ ప్రాంతం నుంచి రా వాటర్ తీసుకొని శుద్ధి చేసేందుకు అవసరమైన ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మించేందుకు గురువారం జిల్లా పబ్లిక్ హెల్త్ ఎస్ఈ శ్రీనివాసులు స్థానిక కార్పొరేషన్ అధికారులతో కలసి స్థలం పరిశీలించారు. శ్రీనివాసులు మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో శుద్ధి చేసిన కృష్ణా జలాలను అందించేందుకు ఇప్పటికే ఏఐఐబీ (ఏషియన్ ఇండియన్ బ్యాంక్) సహకారంతో 230 కిలోమీటర్లు పైప్‌లైన్ ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. కార్పొరేషన్ వ్యాప్తంగా తాగునీటిని అందించేందుకు అవసరమైన ట్రీట్మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేయాల్సి ఉందని, ఉండవల్లి గ్రామంలో సీఆర్‌డీఏకి ఇచ్చిన దేవస్థానం భూములు తీసుకునేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని, దాన్లో భాగంగానే స్థల పరిశీలన చేశామని తెలిపారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఈఈ శ్యాంప్రసాద్, కార్పొరేషన్ డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్, వైఎస్సార్ సీపీ నాయకులు దంటు బాలాజీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

బోడిపాలెం(కాకుమాను): ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్య సేవలు అందించాలని కాకుమాను జెడ్పీటీసీ సభ్యురాలు ముజావర్ షేక్ గుల్జార్ బేగం తెలిపారు. మండలంలోని బోడిపాలెం వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను గురువారం సర్పంచ్ నలిగల ఉషారాణితో కలసి ఆమె తనిఖీ చేశారు.ఈ సందర్భంగా గుల్జార్ బేగం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలంతా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసి, అనేక మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. సిబ్బంది ప్రతి రోజూ క్లినిక్‌లో ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని ఆమె సూచించారు.


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు గుల్జార్ బేగం

నులి పురుగుల నివారణపై అవగాహన నేడు

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నులి పురుగుల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు రవిప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే అవగాహన కార్యక్రమంలో మండల స్థాయి అధికారులంతా తప్పనిసరిగా పాల్గొనాలని ఆయన కోరారు.

మత్తుకు బానిసలుగా మారితే భవిష్యత్తు చిత్తు

పెదకాకాని: కౌమార దశలో బాలలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వెనిగండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎస్. రామాంజిరెడ్డి సూచించారు. పెదకాకాని మండలం కొప్పురావూరు జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం మత్తు పదార్థాల అనర్థాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ రామాంజనేయరెడ్డి మాట్లాడారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన విద్యార్థులు, యువకులు చదువులు వదిలి సర్వస్వం కోల్పోయి నిరాశ్రయులవుతారని తెలిపారు. డిప్రెషన్, ఆందోళన వంటి మానసిక సమస్యలు, గుండె సంబంధిత, శ్వాసకోశ వ్యాధులు, మూత్రపిండాలు దెబ్బ తినడం వంటి దీర్ఘకాలిక సమస్యలు, ఊపిరితిత్తుల వ్యాధి, క్యాన్సర్, మానసిక అనారోగ్యం, ఇతర ప్రభావాలు ఉంటాయని వివరించారు. కార్యక్రమానికి హెచ్ ఎం డి. ప్రభాకరరావు అధ్యక్షత వహించారు. గ్రామ సర్పంచ్ ఆలా సాంబశివరావు, వైద్య సిబ్బంది పి.సంధ్యారాణి, రాజ్యలక్ష్మి, వెంకటేశ్వర్లు, క్రాఫ్ సమన్వయకర్త ఎ.వెంకయ్య, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి రామాంజిరెడ్డి

శనగల కొనుగోలు కేంద్రం ఏర్పాటు

పెదనందిపాడు: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం ఉదయం శనగల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు జీడీసీఎంఎస్ అధికారులు తెలిపారు. ప్రభుత్వం మద్దతు ధర క్వింటాకు రూ.5330 ప్రకటించిందని పేర్కొన్నారు. రైతులంతా శనగల్ని పెదనందిపాడు మార్కెట్ యార్డు వద్దకు తెచ్చుకోవాలని అధికారులు సూచించారు.

మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై కేసు



మంగళగిరి: మైనర్లకు ద్విచక్ర వాహనాలిస్తే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని పట్టణ ఎస్ఐ మహేంద్ర హెచ్చరించారు. గురువారం నగర వీధుల్లో పట్టణ సీఐ బి అంకమ్మరావు ఆదేశాల మేరకు సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ద్విచక్ర వాహనాలు నడుపుతున్న పలువురు మైనర్లను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్ఐ మహేంద్ర మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండని మైనర్లు ద్విచక్ర వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు గురవుతూ సాటి వాహన దారులను గాయాలపాలు చేస్తున్నారని తెలిపారు. ద్విచక్ర వాహనాలిస్తే తల్లిదండ్రులపై చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

చౌక దుకాణాలలో విజిలెన్స్ దాడులు

తాడేపల్లిరూరల్: రేషన్‌షాపుల్లో ఉండాల్సిన బియ్యం నిల్వ కన్నా 74 బస్తాలు(50 కిలోలు) తక్కువగా ఉండటంపై కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తెలిపారు. తాడేపల్లి మండలం పెనుమాకలో పేద ప్రజలకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యాన్ని రేషన్ డీలర్లు కార్డుదారులకు పంపిణీ చేయకుండా, అక్రమంగా తరలించి అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నట్లు అందిన సమాచారం మేరకు గుంటూరు రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, స్థానిక పౌర సరఫరాల శాఖ అధికారులతో కలసి గురువారం రాత్రి తాడేపల్లి మండలం పెనుమాక గ్రామంలోని రేషన్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. డీలర్ భ్రమరాంబ నిర్వహిస్తున్న రేషన్ షాపుని తనిఖీ చేయగా 74 బస్తాల బియ్యం తక్కువ ఉన్నట్లు గుర్తించారు. డీలర్‌పై 6–ఎ కేసుతో పాటు క్రిమినల్ కేసు కూడా నమోదు చేయాలని మంగళగిరి సివిల్ సప్లైస్ డిప్యూటీ తహసీల్దార్‌ను విజిలెన్స్ అధికారులు ఆదేశించారు. తనిఖీలలో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీహరిరావు, స్థానిక పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్ సిబ్బంది పాల్గొన్నారు.

తెనాలి పారిశ్రామికవేత్త జగదీశ్ ప్రకాష్ కన్నుమూత


సూర్యదేవర జగదీశ్ ప్రకాష్ (ఫైల్)

తెనాలి: పట్టణ చినరావూరుకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త సూర్యదేవర జగదీశ్ ప్రకాష్ (79) మృతిచెందిన సమాచారం ఆలస్యంగా తెలిసింది. చెన్నైలో ఉంటున్న జగదీశ్ ప్రకాష్ ఊపిరితిత్తులకు సంబంధించిన అనారోగ్యంతో ఈనెల 7న అక్కడే అపోలో ఆసుపత్రిలో మృతి చెందారు. పట్టణ చినరావూరు మునసబు, రాజకీయంగా పేరొందిన సూర్యదేవర లక్ష్మీనారాయణ కుమారుడు జగదీశ్ ప్రకాష్. 1944 జులై 22న జన్మించారు. చెన్నైలోని సీఎల్ఆర్ఐలో లెదర్ టెక్నాలజీ చేసి, హైదరాబాద్ డెక్కన్ లెదర్స్‌లో కొంతకాలం ఉద్యోగం చేశాక సొంత పరిశ్రమను స్థాపించి చెన్నైలోనే స్థిరపడ్డారు. దేశవిదేశాల్లో తమ తోలు ఉత్పత్తుల ప్రదర్శనలు నిర్వహిస్తున్న క్రమంలో ఆయన ప్రపంచ దేశాల్లో విస్తృతంగా పర్యటించారు. ఆయనకు భార్య సామ్రాజ్యలక్ష్మి, కుమారుడు పవన్, కుమార్తె గిరిజ, మనుమ సంతానం ఉన్నారు. వీరి కుమారుడు, అల్లుడు వెంకటరమణ కుటుంబాలు కూడా తోళ్ల పరిశ్రమలోనే స్థిరపడ్డాయి. తమ పరిశ్రమల్లో ఎందరికో ఉపాధిని కల్పించిన జగదీశ్ ప్రకాష్, సామాజిక సేవలోనూ కొనసాగారు. తెనాలిలో 17 ఏళ్ల క్రితం విజ్ఞాన వేదిక పేరుతో సామాజిక సేవాసంస్థను స్థాపించారు. అంధులు, వికలాంగులు, పారిశ్రామిక కార్మికులు, వరద బాధితుల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉపకార వేతనాలను ఇస్తూ వచ్చారు. చినరావూరులో శివాలయ పునర్నిర్మాణం, చినరావూరు చెరువు ప్రక్షాళన, సుందరీకరణ, శ్మశానవాటిక ఆధునికీరణలోనూ విజ్ఞానవేదిక బాధ్యత వహించింది. పట్టణ, పరిసరాలకు చెందిన వివిధ రంగాల ప్రముఖులు జగదీశ్ ప్రకాష్ భౌతికకాయాన్ని సందర్శించి పుష్పాంజలి ఘటించారు.

విద్యుత్ శాఖ విజిలెన్స్ విస్తృత తనిఖీలు

రూ 12.62 లక్షల అపరాధ రుసుం వసూలు

గుంటూరు రూరల్: విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం ఆధ్వర్యంలో గురువారం గుంటూరు డీ–7 సెక్షన్ గోరంట్ల, జొన్నలగడ్డ, రెడ్డిపాలెం తదితర గ్రామాల్లో విస్తృత స్థాయి తనిఖీలు చేశారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి. విజయకృష్ణ, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి. శ్రీనివాసబాబు మాట్లాడుతూ 58 మంది అధికారులు, 118 మంది సిబ్బంది 58 బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేపట్టినట్లు చెప్పారు. 5265 సర్వీసులు తనిఖీ చేసి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 234 మందికి రూ. 12.62 లక్షల అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. అనుమతించిన కేటగిరిలో కాకుండా ఇతర కేటగిరిలో విద్యుత్ వాడుకుంటున్న ఏడు మందికి రూ. 70 వేలు, అనుమతించిన లోడుకంటే అదనంగా విద్యుత్ వాడుతున్న 227 మందికి రూ 11.92 లక్షల అపరాధ రుసుం విధించినట్లు చెప్పారు. విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని, దీనికి ఎవరైనా పాల్పడితే పూర్తి వివరాలతో 9440812263, 9440812360, 9440812361 నంబర్లకు నేరుగా గానీ లేదా వాట్సప్ ద్వారా గానీ సమాచారం అందించాలని కోరారు. తనిఖీల్లో డీఈఈలు ఎం.రవికుమార్, సుబ్బరాయుడు, ఏఈ కె. కోటేశ్వరరావు, ఆపరేషన్ ఏఈ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పెన్షనర్ల వినతి



తెనాలి: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ దశలవారీ పోరాటంలో భాగంగా తెనాలి యూనిట్ ఆధ్వర్యంలో గురువారం తమ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ తహసీల్దార్, సబ్ ట్రెజరీ కార్యాలయాల్లో వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వ పెన్షనర్లకు సంబంధించి అపరిష్కృత సమస్యల్లో కనీసం తాము పేర్కొన్న డిమాండ్లనైనా పరిష్కరించాలని కోరారు. 2018 జులై ఒకటి నుంచి బకాయి ఉన్న డీఆర్ అరియర్లు వెంటనే చెల్లించాలని, 11వ పీఆర్సీలో గల అసంబద్ధతల సవరణకు అనామలీస్ కమిటీ ఏర్పాటు చేయాలని, 12వ పే కమిషన్ ఏర్పాటుకు ఉత్తర్వులు జారీచేయాలని మొత్తం తొమ్మిది అంశాలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మాచిరాజు రామకృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి బొమ్మదేవర వెంకటేశ్వరరావు, కోశాధికారి బెల్లంకొండ హృదయరాజు నేతృత్వంలో కార్యవర్గం అధికారులను కలిసింది.

రైతు సంఘం కరపత్రాల పంపిణీ



తెనాలి: కేంద్రంలో తొమ్మిదేళ్ల బీజేపీ పాలనలో నిత్యావసర సరుకులు, డీజిల్, పెట్రోలు, వంటగ్యాస్, ఔషధాలు, ఆహారపదార్థాల ధరలు విపరీతంగా పెరిగాయని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి చెప్పారు. ఫలితంగా పేద, మధ్యతరగతి ప్రజలపై ఆర్థికభారం పెరిగిందన్నారు. తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యుడు ముద్దన సాంబశివరావుతో కలిసి 'ఏప్రిల్ 5న చలో ఢిల్లీ ఎందుకు?' అనే కరపత్రాన్ని రైతులు, కూలీలకు పంపిణీ చేశారు. చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

తెనాలి ఆర్టీసీ డిపోలో ఉద్యోగుల నిరసన




తెనాలిఅర్బన్: ఏబీజేఏసీ అమరావతి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ తెనాలి శాఖ ఆధ్వర్యంలో గురువారం ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి కొద్దిసేపు నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ రీజినల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఐమళ్ళ రాజేష్‌ఖన్నా, రీజనల్ నాయకులు టి.ధనుంజయరెడ్డి, తెనాలి డిపో అధ్యక్ష కార్యదర్శులు కె.బాబు, ఎం.మనోజ్‌కుమార్, నాయకులు వి.జోషిబాబు, సిహెచ్.రవికుమార్, ఎన్.ప్రసాద్, టి.యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

హార్మోనియం కళాకారుడికి సన్మానం



తెనాలిఅర్బన్: నందమూరి తారకరామారావు శత జయంత్యుత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో గురువారం బభ్రువాహన చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. శుక్రవారం రైతుబిడ్డ చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం హార్మోనియం కళాకారులు, వాస్తు సిద్ధాంతులు కొతరపు శంకరరావును సన్మానించారు. కార్యక్రమంలో ఈదర వెంకటపూర్ణచంద్, వారె సాంబశివారెడ్డి, మరియదాసు, గుమ్మడి ప్రసాద్, యెమి సజీర్, పెమ్మసాని పోతురాజు, ఎన్టీఆర్ జగన్, దేవిశెట్టి భాస్కర్, ముళ్ళపూడి వెంకటష్, కుదరవల్లి శ్రీనివాసరావు, నల్లూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు అన్నదానం



గుంటూరు రూరల్: ఎంవీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మొగిలిపువ్వు వెంకటేశ్వరరావు 3వ వర్ధంతి సందర్భంగా గురువారం నగర శివారులోని డంపింగ్ యార్డ్, శాంతి హృదయ్ అనాథ, వృద్ధాశ్రమాల్లో 300 మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా బొంతపాడు జేసీఎస్ కన్వీనర్ దారం అశోక్‌కుమార్ మాట్లాడుతూ పేదలు, అనాథలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90102 23706 (తెనాలి, వేమూరు, రేపల్లె)
99122 25447 (తెనాలి)
Office mail : sakshigntadvt@gmail.com